సాక్షి తిరుపతి

సోమవారం । 8 । సెప్టెంబర్ । 2025


తిరుపతి సైన్స్ సెంటర్‌లో సందడి



• ఆలయ 'గ్రహణం'


శ్రీకాళహస్తి ఆలయంలో భక్తులు




కాణిపాకం, పెంచలకోన ఆలయాల తలుపులు మూసివేస్తున్న అధికారులు

సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం జిల్లాలోని ఆలయాలు మూతపడ్డాయి. రాత్రి 9.57 నుంచి గ్రహణ సమయం మొదలవుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం నుంచే ఆలయాలను మూసివేశారు. ఈ క్రమంలోనే తిరుమల, తిరుపతి, కాణిపాకం, పెంచలకోన, బోయకొండ, మొగిలిలో సంప్రదాయబద్ధంగా మహద్వారాలు మూతపడ్డాయి. అయితే రాహుకేతు క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదిదంపతులకు శాంతి అభిషేకం నిర్వహించారు. గ్రహణ సమయం ముగిసిన తర్వాత ఆలయాలను శుద్ధి చేశారు. సంప్రోక్షణ, పుణ్యాహవచనం తర్వాత భక్తులను యథావిధిగా దర్శనానికి అనుమతించారు.

– తిరుమల/శ్రీకాళహస్తి/కాణిపాకం


మూతపడిన తిరుమల శ్రీవారి ఆలయ మహాద్వారం

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు పీజీఆర్ఎస్ కొనసాగుతుందని పేర్కొన్నారు. గతంలో అర్జీలు ఇచ్చి ఉంటే మళ్లీ అర్జీలు ఇవ్వాల్సిన అవసరం లేదని, గతంలో ఇచ్చిన స్లిప్‌ను చూపితే సరిపోతుందని చెప్పారు.

జిల్లా అడహాక్ కమిటీ ఏకగ్రీవం

తిరుపతి అర్బన్ : నగరంలోని ఎన్జీఓ కార్యాలయంలో ఆదివారం తిరుపతి జిల్లా అడహాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఎస్.సురేష్‌బాబు, కోకన్వీనర్‌గా సి.రఘు, కోశాధికారిగా లలిత్‌కుమార్ , ఉపాధ్యక్షులుగా శ్రవణ్ కుమార్, సభ్యులుగా చెంచురత్నం, ఫణీంద్ర, జనార్దనయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జగదీశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు పెంచల్ రావు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ. తిరుపతి తాలూకా అధ్యక్షుడు సురేష్ బాబు, కార్యదర్శి బాలాజీ పాల్గొన్నారు.

నేటి నుంచి లాసెట్ అడ్మిషన్ల ప్రక్రియ షురూ

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన ఏపీ లాసెట్ మూడు, ఐదు సంవత్సరాల ప్రక్రియకు ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదలైంది. సోమవారం నుంచి 11వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగనుంది. ఈనెల 12వ తేదీ నుంచి 14 వతేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. 15న వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పిస్తూ 17వ తేదీన సీట్ల కేటాయింపు చేయనున్నారు. అలాగే బీఈడీ కోర్సులకు సైతం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ప్రారంభం


పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

చిల్లకూరు : గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం రాష్ట్రస్థాయి ఏడవ ర్యాంకింగ్ చెస్ పోటీలు ప్రారంభం అయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చిన్నారులు, పెద్ద క్రీడాకారులు సుమారు 194 మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలపై ఆసక్తి నెలకొందన్నారు. చెస్ టోర్నమెంటు డైరెక్టర్‌గా షేక్ షరీఫా, చీఫ్ ఆర్బిటరీగా బాలాజీ చౌదరి వ్యవహరిస్తున్నారు. ఈ పోటీలను ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ రవిప్రసాద్, రాయ్ చెస్ అకాడమి డైరెక్టర్ షేక్ అబ్దుల్ అజీజ్, తిరుపతి చెస్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసమూరి, గూడూరు చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్ర చౌదరి, రవిబాబు పర్యవేక్షిస్తున్నారు.

వేడుకగా విశ్వరూప పాదయాత్ర


విశ్వరూప దర్శనయోగ అధ్యయనం పఠిస్తున్న పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ

తిరుపతి కల్చరల్: కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి, సత్యచంద్ర సరస్వతి స్వామివార్ల విశ్వావసు నామ సంవత్సరం చాతుర్మాస్య దీక్ష విరమణ సందర్భంగా కంచి మఠ స్వామీజీల ఆధ్వర్యంలో మఠ భక్తులు ఆదివారం సాయంత్రం నగరంలో విశ్వరూప యాత్ర వేడుకగా చేపట్టారు. కంచి మఠం మహాపాదుకా మండపం నుంచి దివ్యారామం ఉద్యానవనం వరకు ఈ విశ్వరూప పాదయాత్ర సాగింది. అనంతరం అక్కడ కంచి మఠాధిపతులు శ్రీభగవద్గీతలోని విశ్వరూప దర్శనయోగ అధ్యాయనాన్ని పఠించారు. అనంతరం స్వామివారు భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం ఉపకులపతి జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ ఉపకులపతి రాణి సదాశివమూర్తి, నగరంలోని పలువురు ప్రముఖులు, మఠం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.


కేవీబీ పురం మండలంలో వరి ధాన్యాన్ని నివాసానికి తరలిస్తున్న రైతులు

ధాన్యం.. దైన్యం



ధాన్యం పరిస్థితి దయనీయంగా మారింది. గిట్టుబాటు ధర లేక కల్లాల్లోనే మిగిలిపోయింది. కొనుగోలు చేసేవారి కోసం పడిగాపులు కాస్తోంది. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతోంది. పండించిన రైతుకు చేయూతనందించే అవకాశం లేక దిగాలుపడుతోంది. పైగా వ్యాపారులు సిండికేట్‌గా మారి సాగు చేసిన అన్నదాతను దగా చేస్తుంటే కుమిలిపోతోంది. ఆరుగాల కష్టం దళారుల పాలవుతుంటే దైన్యంగా విలపిస్తోంది. గతంలో బస్తా రూ.2,200 పలకడంతో గర్వంగా తల ఎగరేసిన రోజులను గుర్తు చేసుకుంటోంది. ప్రస్తుతం బస్తా రూ.1,200లకే పడిపోవడంపై కన్నీరుమున్నీరవుతోంది. పాలకులు స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దేశానికి వెన్నెముకను నిలబెట్టాలని కోరుతోంది.


తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లెకు చెందిన గంధం రామకృష్ణయ్య తనకున్న 2.70 ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు. ఎకరాకు రూ.25 వేలకు పైనే ఖర్చు చేశాడు. అదునుకు యూరియా దొరక్కపోవడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. వ్యాపారులు బస్తా రూ.1,200 అడుగుతుండటంతో ఇలా రోడ్డుపై ధాన్యాన్ని ఉంచుకుని గిట్టుబాటు ధర కోసం ఎదురు చూస్తున్నాడు.


చిట్టమూరు మండలం ఆరూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు తనకున్న 2.10 ఎకరాల్లో వరి సాగు చేశాడు. 68 బస్తాల దిగుబడి వచ్చింది. గిట్టుబాటు ధర కోసం ఎదురుచూసి చేసిన అప్పులకు వడ్డీ కట్టలేక పుట్టి రూ.15 వేలకు అమ్మేశాడు. గత ప్రభుత్వ హయాంలో ఇదే పుట్టి వరి ధాన్యం రూ.19 వేలకు అమ్మినట్లు శ్రీనివాసులు చెబుతున్నాడు.

- గతంలో బస్తా రూ.2,200.. నేడు రూ.1,200
- గిట్టుబాటు ధరలేక కల్లాల్లోనే ధాన్యం
- కొనుగోలు కేంద్రాలు కరువు.. ఎగుమతులకు అనుమతి లేదు
- సిండికేట్‌గా మారిన వ్యాపారులు, మిల్లర్లు, దళారులు
- రైతు అవసరాలను ఆసరాగా తక్కువ ధరకే కొనుగోళ్లు
- గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి లేదంటున్న అన్నదాతలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : వరికి గిట్టుబాటు ధర లేక అన్నదాతలు అల్లాడిపోతున్నారు. పెట్టిన పెట్టుబడి చేతికి రాకపోవడంతో అప్పుల పాలవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో తిరుపతి, చిత్తూరు జిల్లాలో 86 వేల ఎకరాల్లో వరి పంట సాగైంది. సాధారణ సాగు విస్తీర్ణంలో 15 శాతం తక్కువ వరి పంట వేశారు. ప్రస్తుతం 50 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. మరో వారం పది రోజుల్లో 50 శాతం వరి కోతలు పూర్తవుతాయి. కోతలు పూర్తయిన వారికి ఎకరానికి 25 నుంచి 30 బస్తాలు దిగుబడి సాధించారు. కొనబోతే కొరివి, అమ్మబోతే అడవి అన్నచందంగా వరి ధాన్యం కొనుగోలు చేయటానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. వచ్చినా తక్కువ ధరకు అడుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

దళారుల ఇష్టారాజ్యం

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకే వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని రైతులు ఎదురుచూశారు. అయితే ఇప్పటి వరకు ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, వరి ఎగుమతులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో దళారులు, వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారింది. అంతా సిండికేట్‌గా మారి బస్తా రూ.1,200 నిర్ణయించారు. వరి కోతలు పూర్తయిన రైతులు అనేక మంది ఆ ధరకు విక్రయిస్తే గిట్టుబాటు కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొద్ది రోజులు వేచి చూద్దామని రైతులు కొందరు కల్లాల్లో ధాన్యాన్ని కుప్పలు పోసుకుని మద్దతు ధర కోసం ఎదురుచూస్తున్నారు. మరి కొందరు కూట్ల ద్వారా నిల్వచేసుకున్నారు.

వరిపంట కొనుగోలే లేదు


వాకాడు మండలం కోడివాకలో వరి ధాన్యాన్ని కూట్లలో నిల్వచేసుకుని ఉన్న దృశ్యం

పుంగనూరు : పుంగనూరులో వరిపంట కొనుగోలుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఖరీఫ్ పంట పండించిన రైతులు వరి ధాన్యాన్ని తమకు నచ్చిన రీతిలో క్వింటా రూ.2,200తో విక్రయాలు చేసుకున్నారు. కాగా పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల , సదుం, రొంపిచెర్లం, పులిచెర్ల మండలాలతో పాటు పంజాణి, గంగవరం మండలాల్లో సుమారు 5,200 హెక్టార్లలో సాగు చేశారు. ప్రస్తుతం రబీ సాగు 2.50 హెక్టార్లలో మాత్రమే సాగు అవుతోంది. ఈ సారైన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా లేదా అన్నది చూడాలి.

జగన్ ప్రభుత్వంలోనే వరికి గిట్టుబాటు ధర


జగన్ ప్రభుత్వంలోనే వరికి గిట్టు బాటు ధర ఉండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో గిట్టు బాటు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో బస్తా(76 కేజీలు) వడ్లు రూ.2,300 నుంచి రూ.2,600 వరకు పలికింది. ఇప్పుడు రూ.1,300 నుంచి రూ.1,600 వరకు ఉంది. ఎకరాకు పెట్టు బడి రూ.25 వేలకు పైనే ఖర్చవుతోంది. గిట్టు బాటు ధరలేక ఇబ్బందిగా ఉంది.

సి.హరినాథ్, రైతు, మతుకువారిపల్లె, పులిచెర్ల మండలం

వడమాలపేట చెందిన మునికృష్ణయ్య తనకున్న రెండెకరాల పొలంలో రూ.54 వేలు అప్పుచేసి వరి సాగు చేశాడు. ఇటీవలే వరి కోత కోశారు. ఎకరానికి 25 బస్తాల చొప్పున వచ్చింది. 50 బస్తాలు దిగుబడిలో నుంచి 10 బస్తాలు ఇంటి అవసరాలకు ఉంచుకున్నాడు. మిగిలిన 40 బస్తాల వరి ధాన్యాన్ని విక్రయించి అప్పు తీర్చేయొచ్చని ఆశగా ఎదురుచూశాడు. వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేవారు కరువయ్యారు. చేసేది లేక వ్యాపారులను వెళ్లి కలిశాడు. బస్తా రూ.1,200 చొప్పున ఇస్తే కొనుగోలు చేస్తామని చెప్పారు. చేసేది లేక వ్యాపారి అడిగిన ధరకే విక్రయించాడు. 75 కిలోల బస్తా అయితే.. తేమ ఉందని చెప్పి అదనంగా 6 కిలోల చొప్పున వేసుకున్నాడు. 81 కిలోల బస్తా రూ.1,200 చొప్పున విక్రయించాల్సి వచ్చిందని రైతు బోరుమన్నాడు.

అయినకాడికి అమ్మేసుకుంటున్న రైతులు


కర్రల కాటాలపై తూకాలు వేస్తున్న వ్యాపారులు

వడ్డీలు భరించలేక కొందరు, అత్యవసర పరిస్థితుల్లో మరి కొందరు రైతులు వ్యాపారులు అడిగిన ధరకే విక్రయించి నష్టపోతున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దళారులు, వ్యాపారులు అందిన కాడికి దోచుకునేపనిలో పడ్డారు. వరిలో తేమ ఉందని చెప్పి 6 కిలోలు అదనంగా దండుకుంటున్నారు. మరి కొందరు కర్రలతో కాటా ఏర్పాటు చేసి రాళ్లు, గుండ్లు పెట్టి ధాన్యాన్ని తూకాలు వేసుకుని అన్నదాతలను మరింత మోసం చేస్తున్నారు. కర్రల కాట, రాళ్లు పెట్టి తూకాలు వేస్తే మరో రెండు, మూడు కిలోల ధాన్యం నష్టపోతున్నారు. వ్యాపారులు బస్తా రూ.1,200 కొనుగోలు చేసి మిల్లర్లకు రూ.1,800 చొప్పున విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు.


వరి ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న రైతులు

పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు :


“ అనేక కష్టాలు పడి యాజమాన్య పద్ధతులను పాటించి పంట పండించా. ఇంత చేసినా మద్దతు ధర లేదు. తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. కనీసం ఎరువులు, దున్నకాలకు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు. బస్తా 83 కిలోలు తూకం వేసుకున్నారు. ఇలా చేయడం వల్ల పది బస్తాలకు 30 కిలోలు నష్టపోతున్నాం.

– చిరంజీవి, చౌడేపల్లి, వెదురుకుప్పం మండలం

గతంలో గిట్టుబాటు ధర ఉండేది


గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదు. 110 రోజులు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరలేదు. గత ప్రభుత్వ హయాంలో బస్తా రూ.1,800 నుంచి రూ.2,200 వరకు ధర పలికింది. ఇప్పుడు ఇచ్చే ధర కోత, ఎరువుల ఖర్చులకు కూడా చాలదు. యూరియా దొరక్క తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది.

– మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తి మండలం

ధర లేక ఇంట్లోనే మగ్గుతున్నాయ్


పండించిన వడ్లకు గిట్టుబాటు ధరలేక ఇంట్లోనే మగ్గుతున్నాయ్. బస్తా వడ్లు రూ.1700 ధర ఉంది. ఎకరా వరి పంట సాగు చేశా. 35 బస్తాల వడ్లు దిగుబడి వచ్చింది. పంట సాగుకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టా. వడ్లకు ధర లేకపోవడంతో ఇంట్లోనే మగ్గుతున్నాయి. గిట్టుబాటు ధర లేదని వరి పంట సాగు చేయడం నిలిపి వేశా. ఇప్పుడు భూమికి లీజుకు తీసుకుని బొప్పాయి సాగు చేస్తున్న . ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు కల్పించాలి.

– రైతు చంద్రారెడ్డి, రెడ్డివారిపల్లె, రొంపిచెర్ల మండలం

అనుమతులు రాలేదు


ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేయడానికి అనుమతులు రాలేదు. ఇప్పటికే 90 శాతం వరి ధాన్యం ఒబ్బిళ్లు పూర్తయ్యాయి. గత రబీలో మాత్రమే కొనుగోలు చేశాం. ఖరీఫ్‌లో 80వేల ఎకరాల్లో వరి పంట సాగుచేస్తే.. అందులో 60 వేల ఎకరాలకు పైగా ఎంటీయూ 1010 రకాన్ని సాగుచేశారు. ఆ తర్వాత కేఎస్ఎం, ఏడీడీ 37 రకాలు సాగుచేశారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న రకాన్ని సాగు చేయాలని అవగాహన కల్పిస్తున్నాం.

–ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

నివేదికలు పంపించాం

వరి ధ్యానం కొనుగోలు ప్రస్తుతానికి లేదు. శనివారం రైతు భరోసా, వరి సాగు వివరాలు రాష్ట్ర స్థాయి అధికారులు అడిగారు. ఆ వివరాలు పంపించాం . త్వరలో ఆ వివరాలు వెల్లడిస్తాం. గిట్టుబాటు ధర, ఇతరాత్ర వివరాలు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జరుగుతాయి.

–లక్ష్మి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్, చిత్తూరు

ప్రశాంతంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు


పరీక్షలను పరిశీలిస్తున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్ : ప్రశాంతంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను ఆదివారం తిరుపతిలోని ఆరు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో నిర్వహించామని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు తెలిపారు. ఆదివారం తిరుపతిలోని పలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫారెస్ట్ అసిస్టెంట్ బీట్, బీట్, సెక్షన్ ఆఫీసర్లకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల నిర్వహణకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు చేపట్టామని వెల్లడించారు. ఉదయం పరీక్షల్లో 10,493 మంది అభ్యర్థులకు 8,670 మంది మాత్రమే హాజరయ్యారని పేర్కొన్నారు. 1823 మంది హాజరు కాలేదని స్పష్టం చేశారు. అలాగే మధ్యాహ్నం పరీక్షల్లో 1690 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 1335 మంది మాత్రమే వచ్చారని చెప్పారు. 358 మంది హాజరు కాలేదని వివరించారు.


తమ బంధువులకు చంటిబిడ్డను అప్పగించిన మహిళా అభ్యర్థి


చెట్లకు ఊయలకట్టి బిడ్డలను చూసుకుంటున్న బంధువులు

చంటి బిడ్డలతో హాజరైన మహిళలు

తిరుపతి అర్బన్ : తిరుపతి నగరంలో ఆదివారం పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను నిర్వహించారు. ఈ క్రమంలో తిరుపతి ఎస్వీ జూనియర్ కళాశాలలో పరీక్షలను రాయడానికి పలువురు మహిళా అభ్యర్థులు తమ చంటి బిడ్డలతో పరీక్షలకు హాజరయ్యారు.

ఘటోత్సవ వైభవం


భక్తజన సందోహం మధ్య సాగుతున్న ఘటోత్సవం

• ప్రారంభమైన వెంకటగిరి జాతర

వెంకటగిరి (సైదాపురం) : వెంకటగిరి గ్రామదేవత పోలేరమ్మ జన జాతర అంగరంగ వైభవంగా ఆదివారం ప్రారంభమైంది. ఘటోత్సవంతో అమ్మవారి సంబరం అంబరాన్నంటింది. ఘటోత్సవం చూసేందుకు తరలివచ్చిన అశేష భక్త జనంతో వెంకటగిరి పట్టణ పుర వీధులు కిక్కిరిశాయి. పోలేరమ్మ తల్లీ చల్లగా చూడాలమ్మా అంటూ వేడుకున్నారు. ఘటం కుండలకు అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించి ఆధ్యాత్మికతను చాటుకున్నారు. ఘటం కుండలతో ఇంట్లో పూజలు చేస్తే సాక్షాత్తు పోలేరమ్మ తల్లే ఇంట్లో కొలువై ఉంటుందన్న విశ్వాసం. దీంతో అమ్మవారి ఘటోత్సవానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు.

ఘటోత్సవంలో అత్యుత్సాహం

వెంకటగిరి (సైదాపురం) : రాష్ట్ర పండుగ వెంకటగిరి పోలేరమ్మతల్లి జాతర సందర్భంగా ఆదివారం ఘటోత్సవంలో సంప్రదాయాలకు విరుద్ధంగా కొత్త విధానాలకు తెరలేపడంతో భక్తుల ఆగ్రహంతో పాత పద్ధతిలోనే కొనసాగించారు. వివరాలు ఇలా.. ఆదివారం నిర్వహించిన ఘటోత్సవంలో సంప్రదాయాలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో భక్తుల మనోభావాలు దెబ్బతీశాయి. వాస్తవానికి ఘటోత్సవం జీనుగుల వారి వీధిలోని మెట్టినింటి మండపం వద్ద నుంచి రాజా ప్యాలెస్‌కు నడక మార్గంలో ఘటం కుండలను ఊరేగించడం ఆనవాయితీ. ఈ సంప్రదాయాలను ఈ ఏడాది పక్కన పెట్టి గతంలో ఎప్పుడూ లేని విధంగా ఘటం కుండలను ఊరేగించేందుకు ప్రత్యేక వాహనంలో జీనుగుల వారి వీధిలోని అమ్మ మెట్టి నింటి మండపం వద్ద ఎక్కించేశారు. ఘటం కుండలు నడకమార్గం గుండా రాకపోవడంతో స్థానికంగా ఉన్న పట్టణ ప్రముఖులు ఆగ్రహించారు. దీంతో పోలీసు బందోబస్తు మధ్య యథావిధిగా కాలి నడక ద్వారా సాగించారు.


ప్యాలెస్ వద్ద వాహనం నుంచి ఘటం కుండలను దించుతున్న దృశ్యం

క్లుప్తంగా


ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



విరాళాన్ని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేస్తున్న దాతలు

తిరుమల : టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు తిరుపతికి చెందిన తిరుపతి, తిరుమల హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ నాగార్జున నాయుడు ఆదివారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరికి ఈ మేరకు దాత చెక్కును అందజేశారు.

● శివోహం



వెండి మబ్బులు.. కారు మేఘాలు.. రవి కిరణాల సమ్మేళనంతో శ్రీకాళహస్తీశ్వరాలయం దేదీప్యంగా వెలిగిపోయింది. ఆదివారం సాయంత్రం విజ్ఞాన గిరిపై వెలసిన శివపార్వతుల వద్ద ఈ సుందర దృశ్యం ఆవిష్కృతమైంది.

– శ్రీకాళహస్తి

ముగిసిన పవిత్రోత్సవాలు



శ్రీకాళహస్తి : యాగశాలలో పూజలు



రాపూరు : మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



శ్రీకాళహస్తి : కలశాలు తీసుకొస్తున్న వేద పండితులు



చంద్రగిరి : పూర్ణాహుతితో ఉత్సవంలో వేదపండితులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు ఆదివారం ముగిశాయి. మూల విరాట్‌కు పవిత్ర మాలధారణతో విశేష పూజలు ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం యాగశాల నుంచి పవిత్రమాలలు విశేష పూజా ద్రవ్యాలను శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓ బాపిరెడ్డి, ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకెళ్లి వినాయకుడికి పవిత్రమాల సమర్పించారు. అనంతరం వినాయకుడు, జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి పవిత్రమాలల సమర్పణ వేడుకగా చేపట్టారు. యాగశాలలో శాంతి హోమ పూజలు, చండికేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈవో బాపిరెడ్డి మాట్లాడుతూ.. శ్రీకాళహస్తీశ్వరాలయంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా జరిగాయన్నారు.

మహా పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు

చంద్రగిరి : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మూడు రోజులపాటు జరిగిన పవిత్రోత్సవాలు ఆదివారం మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి, శాంతి హోమం, కుంభప్రోక్షణ, నివేదన చేపట్టారు. అమ్మవారితో పాటు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌కు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆ తర్వాత చక్రత్తాళ్వార్‌ను పల్లకీపై ఊరేగింపుగా పద్మ పుష్కరిణి వద్దకు తీసుకెళ్లి శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. దీంతో పవిత్రోత్సవాలను పరిసమాప్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏఈఓ దేవరాజు, ఆలయ అర్చకులు బాబు స్వామి, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పెంచలకోన క్షేత్రంలో...

రాపూరు : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాలలో భాగంగా ఆదివారం లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిలు శేష వాహనంపై మాడ వీధుల్లో ఊరేగారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను శేష వాహనంపై కొలువుతీర్చి క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వారి అలంకార మండపంలో ఉత్సవ విగ్రహాలకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. శాంతి హోమం, పూర్ణాహుతి , నివేదన, మహాకుంభప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి మాట్లాడుతూ.. మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయన్నారు.

ముగిసిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో



క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ముగింపులో క్రెడాయ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : క్రెడాయ్ సంస్థ ఆధ్వర్యంలో డీబీఆర్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ హాల్లో ఈనెల 5,6,7 తేదీల్లో మూడు రోజుల పాటు ప్రదర్శించిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రదర్శన ఆదివారం సాయంత్రం విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. నిర్మాణ రంగంలో ఆధునిక టెక్నాలజీతో కూడిన ఉత్పత్తులు, వివిధ గృహ సుందరీకరణ వస్తువులు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్, రుణ సదుపాయాలు, అధునాతన కార్లు వంటి వాటిని ఒకే వేదికపైకి తెచ్చి సుమారు 60 స్టాల్స్‌తో ప్రజల కలలు సాకారం చేసే దిశగా కృషి చేసిన క్రెడాయ్ ప్రతినిధులను వారు అభినందించారు. అనంతరం క్రెడాయ్ చైర్మన్ గోపినాథ్, అధ్యక్షుడు రాంప్రసాద్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు తాము ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆదరించి విజయవంతం చేసిన ప్రజలకు, సహకరించిన కంపెనీల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్రెడాయ్ కార్యదర్శి నరసింహులు, ఉపాధ్యక్షుడు రాజేష్‌బాబు, కోశాధికారి హరికృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అటవీ భూములపై రాబందులు

సెంటు భూమి ఆన్‌లైన్ చేసుకునేందుకు రైతులు రెవెన్యూ అధికారుల చుట్టూ ఏళ్ల తరబడి ప్రదక్షిణలు చేస్తున్నారు. నిలువ నీడలేని పేదలు ఇంటి స్థలాల కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు రెవెన్యూ కార్యాలయాలలో గుట్టలుగా పడి ఉన్నాయి. దేశసేవ చేసిన జవాన్‌లకు భూమి ఇవ్వాలంటే అధికారులకు చేతులు రావట్లేదు. అలాంటిది కూటమి ప్రభుత్వంలో కూటమి నేతలు వందల ఎకరాల ప్రభుత్వ అటవీ భూములను యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

- కూటమి నేతల బరితెగింపు
- రామచంద్రాపురంలో కనుమరుగవుతున్న అటవీ భూములు
- వందల ఎకరాలు అన్యాక్రాంతం అవుతున్నా చర్యలు శూన్యం
- రెవెన్యూ అధికారుల సహకారమంటూ ఆరోపణలు
- ఓ నేత కుటుంబ సభ్యులకు భారీగా నగదు బదలాయింపు



చదును చేసిన భూమికి ఫెన్సింగ్ వేసిన పచ్చ నేతలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : తిరుపతికి సమీపంలోని రామచంద్రాపురం మండలానికి విశాలమైన అటవీ ప్రాంతం ఉంది. తుడా పరిధిలో ఈ మండలం కలిసి ఉండటంతో ఇక్కడ భూములకు మంచి డిమాండ్ ఉంది. దీని దృష్ట్యా కూటమి రాబందులు ప్రభుత్వ భూములపై కన్నేశారు. ఖాళీగా కనిపించే అటవీ భూములను తన్నుకుపోతున్నారు. మార్కెట్‌లో భూమి ధరలు విపరీతంగా ఉండటంతో కొందరు కూటమి నాయకులు పక్కా ప్రణాళికతో అదును చూసుకుని అటవీ భూములను చదును చేయడం, హద్దులు గీసుకొని ఇనుప కంచెలు వేసుకొని దర్జాగా ఆక్రమించేస్తున్నారు. ఆపై భూములకు హద్దురాళ్లు పెట్టుకొని ఉపాధి హామీ నిధులతో యథేచ్ఛగా మామిడి తోటలను పెంచుకోవడం కొసమెరుపు. అక్రమణదారులకు అండగా కొందరు ప్రభుత్వ ఉద్యోగులు తొత్తులుగా మారిపోవడంతో ఇష్టారాజ్యంగా సర్వే నంబర్లు సృష్టించడం, దొంగ పట్టాలను రూపొందించడం, అధికార బలంతో ఆన్‌లైన్ ప్రక్రియలు చేస్తున్నారంటూ ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. దీనిపై కొంత మంది రెవెన్యూ అధికారులు హస్తం ఉందని మండలంలో జోరుగా చర్చ సాగుతోంది.



గత ప్రభుత్వంలో అటవీ భూముల్లో ఎన్‌ఆర్‌జీఎస్ పథకం కింద పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఆక్రమణలు ఎక్కడంటే..

మండంలోని అనుప్పల్లి సర్వే నంబరు 411 నుంచి 480 వరకు సర్వే నంబర్లను సృష్టించుకుని సుమారు 100 ఎకరాలకు పైగా అటవీ భూమిని ఆక్రమించేశారు. పుల్లమనాయుడు కండ్రిగకు చెందిన ఓ ఎస్టీ మహిళకు దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2 ఎకరాల భూమికి సంబంధించి పట్టాను అందజేశారు. అయితే అదే పట్టాతో సమీప గ్రామంలో అగ్రకులానికి చెందిన ఓ నేత 10 ఎకరాలకు పైగా భూమిని ఆక్రమించేశాడు. ఆపై ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద పనులు సైతం చేయించుకుని, ప్రస్తుతం వాటి ఆనవాళ్లు లేకుండా చెరిపేశారు. రాయలచెరువు సర్వే నంబరు 410/1, 410/6, 409/1ఎలో నాలుగు ఎకరాలు ఉన్నట్లు పత్రాలు సృష్టించుకున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో 20 ఎకరాలకు పైగా ఆక్రమించుకోవడం విస్మయానికి గురిచేస్తోంది.

బోగస్ సర్వే నంబర్లతో ఆక్రమణలు..

అనుప్పల్లి, రాయలచెరువు, పుల్లమనాయుడు కండ్రిగలో వందల ఎకరాల ఆక్రమణలోని పత్రాల్లో నమోదు చేసిన సర్వే నంబర్లు పూర్తిగా బోగస్ నంబర్లేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో 2019లో అటవీ భూముల ఆక్రమణలపై అధికారులు అడ్డుకున్నారు. ఇక్కడ ఎలాంటి పనులు చేయకూడదంటూ స్పష్టం చేశారు. దీంతో గత ప్రభుత్వంలో ఆక్రమణలకు చెక్ పడింది.

ప్రేక్షకపాత్ర వహిస్తున్న రెవెన్యూ అధికారులు

రామచంద్రాపురం మండలంలో కోట్లాది రూపాయల విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నా వాటిని రక్షించాల్సిన రెవెన్యూ శాఖ అధికారులు మౌనంగా ఉండడంపై ప్రజలు మండిపడుతున్నారు. 2014–19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అటవీ భూముల దోపిడీపై జిల్లా అధికారులు సైతం చర్యలు చేపట్టారు. వారి వద్ద ఉన్న పత్రాలు, సర్వే నంబర్లు బోగస్ అని అధికారులు అప్పట్లోనే తేల్చేశారు. అయితే ప్రస్తుతం మరోసారి కూటమి అధికారంలోకి రావడంతో రెక్కలు విప్పుకుని అటవీ భూములపై వాలిపోతున్నారు. విలువైన భూములను పరిరక్షించాల్సింది పోయి, రెవెన్యూ అధికారులు వారితో చేతులు కలపడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అటవీ భూములను పరిరక్షించాలని కోరుతున్నారు.

అటవీ భూముల వెనుక ఆ నేత అభయం

రామచంద్రాపురం మండలంలో గత ఏడాదిన్నర కాలంలో జరిగిన వందల ఎకరాలు అన్యాక్రాంతం వెనుక నియోజకవర్గానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యులు సంపూర్ణ సహకారం ఉందన్న చర్చ మండలంలో జోరుగా సాగుతోంది. గత వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన స్థానిక నేత ఒకరు ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యులతో డీల్ చేసినట్లుగా ఆ పార్టీ నేతలో బహిరంగంగా విమర్శిస్తున్నారు. వందల ఎకరాలను కూటమి నేతలు వశం చేసుకోవడానికి, సుమారు రూ.40 లక్షలకు పైగా ముడుపులు అందించినట్లు విశ్వసనీయ సమాచారం.



ఇటీవల రాయలచెరువు సమీపంలోని అటవీ భూమిలో హిటాచీ సాయంతో చదును చేస్తున్న దృశ్యం



ప్రస్తుతం అదే అటవీ భూములు అన్యాక్రాంతం చేసుకుని మామిడి మొక్కలు నాటిన అక్రమార్కులు



గతంలో అటవీ భూమి ఆక్రమణలపై పట్టాలను రద్దు చేసినా, కూటమి ప్రభుత్వం వచ్చాక కబ్జాదారులు వేసిన ఫెన్సింగ్

10 నుంచి స్కూల్ గేమ్స్ అండ్ అథ్లెటిక్స్

సూళ్లూరుపేట : మండలంలోని కోటపోలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో 69వ స్కూల్స్ గేమ్స్ అండ్ అథ్లెటిక్స్ పోటీలను అండర్-14, అండర్-17 బాల బాలికలకు క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారులు కేఎంఎస్ సునీల, ఎన్ శీనయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ నెల 10న అథ్లెట్స్ పోటీలు, 11న బాలురకు, 12న బాలికలకు పోటీలను నిర్వహించనున్నామని తెలియజేశారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, చెస్, యోగ, బ్యాడ్మింటన్ క్రీడల్లో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. అండర్-14 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 01-01-2012 తరువాత జన్మించి వుండాలని, 6వ తరగతి నుంచి 9వ తరగతి లోపు చదువుతూ వుండాలని తెలిపారు. అండర్-17 విభాగంలో 01-01-2009 తరువాత జన్మించి వుండాలి. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతూ వుండాలన్నారు. ఈ క్రీడలకు సంబంధించి మండల కో-ఆర్డినేటర్ సన్నాయి భాస్కర్‌ను సంప్రదించాలని సూచించారు.

బస్సును ఢీకొన్న ట్రాక్టర్
ఇద్దరికి గాయాలు



బోల్తా కొట్టిన ట్రాక్టర్

దొరవారిసత్రం: జాతీయ రహదారిపై ముందు వెళుతున్న ప్రైవేటు బస్సును ఢీకొని ట్రాక్టర్ బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, టపాయిండ్లు గ్రామానికి చెందిన రమేష్, కల్లూరుకు చెందిన సురేంద్ర ట్రాక్టర్‌ను సర్వీస్ చేసుకునేందుకు సూళ్లూరుపేటకు బయలుదేరారు. మార్గమధ్యంలో అదుపు తప్పిన ట్రాక్టర్ ముందు వెళుతున్న ప్రైవేట బస్సును ఢీకొని బోల్తా పడింది. దీంతో డ్రైవర్, మరో వ్యక్తి గాయపడ్డారు. సమాచారం అందుకున్న ప్లాజా అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స చేసి సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక ఎస్ఐ అజయ్‌కుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూ నిరాకరణ !

- పీజీ అడ్మిషన్ల బాధ్యత నాగార్జున వర్సిటీకి అప్పగింత
- ఎట్టకేలకు విడుదలైన పీజీసెట్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్



ఎస్వీయూ పరిపాలనా భవనం

తిరుపతి సిటీ : పీజీ సెట్-25 అడ్మిషన్ల ప్రక్రియపై ఉన్నత విద్యా మండలి వ్యవహారశైలిపై ఎస్వీయూ అసహనం వ్యక్తం చేసి నిరాకరించింది. దీంతో ఆ బాధ్యతలను నాగార్జున వర్సిటీకి అప్పగించారు. ఆ యూనివర్సిటీ సైతం తాము చేపట్టలేమని తెగేసి చెప్పినా కాళ్లవేళ్లా పడటంతో ఎట్టకేలకు ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. ఆదివారం నాగార్జున వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రవికుమార్‌కు కౌన్సెలింగ్ కన్వీనర్‌గా నియమించారు.

పాత పద్ధతిలోనే కౌన్సెలింగ్

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన విధంగా రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు ఉమ్మడి పద్ధతిలోనే ప్రవేశాలు చేపట్టాలని ఆదేశించింది. ఎట్టకేలకు పీజీ ప్రవేశాల ప్రక్రియకు సన్నద్ధమయ్యారు. సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసి పదిరోజుల్లో అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఉన్నత విద్యామండలిని ఆదేశించింది

నోటిఫికేషన్ విడుదల వివరాలు

పీజీసెట్-2025 అడ్మిషన్ల ప్రక్రియకు ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. సోమవారం నుంచి వారం రోజుల పాటు పీజీ కోర్సులకు అడ్మిషన్ల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. 20వ తేదీన సీట్ల కేటాయింపు ఉండనుంది. సీట్లు పొందిన విద్యార్థులు 22 నుంచి 24వ తేదీలోపు రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.

ఈ- క్రాప్ పూర్తయ్యేనా!

- ఈ నెల 30 వరకే ఈ క్రాప్‌కు గడువు

తిరుపతి అర్బన్ : ఖరీఫ్ సీజన్‌లో జూలై 15 నుంచి సెప్టెంబర్ 30 వరకు జిల్లాలో ఈ-క్రాప్‌ను పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి. కాగా జూలై 15 నుంచి సెప్టెంబర్ 7 వరకు (23 రోజుల్లో) 14శాతం మాత్రమే ఈ-క్రాప్ పూర్తి చేశారు. అయితే సెప్టెంబర్ 8 నుంచి 30 వరకు (23 రోజుల్లో) 86 శాతం ఈ-క్రాప్ పూర్తి చేయడం సాధ్యమేనా..అంటూ రైతులు చర్చించుకుంటున్నారు. సమయం లేకపోవడంతో తప్పులు తడకగా ఈ- క్రాప్ చేస్తున్నారని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట సాగు చేయకున్నా...చేసినట్లు చూపడం... పంట సాగు చేసినా చేయలేదని చూపడం...ఇలా పొరబాట్లు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్ల కొరత...

గత ప్రభుత్వంలో జిల్లాలో 442 రైతు భరోసా కేంద్రాల్లో 442 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉండేవారు. అయితే కూటమి ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాన్ని...రైతు సేవా కేంద్రంగా పేరు మార్పు చేశారు. అనంతరం రేషన్‌లైజేషన్ పేరుతో 330కి రైతు సేవా కేంద్రాలను కుదింపు చేశారు. అయితే 180 రైతు సేవా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిసెంట్ల పనిచేస్తున్నారు. పలుచోట్ల ఖాళీలు ఉండడంతో కొందరికి రెండు లేదా మూడు రైతు సేవా కేంద్రాల బాధ్యతలను అప్పగించారు. దీంతోనే ఈ క్రాప్ పారదర్శకత కోల్పోతుందని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఓ వైపు ఉద్యోగులు కొరత...మరోవైపు రేషన్‌లైజేషన్ పేరుతో రైతు సేవా కేంద్రాలు కుదింపు....ఇంకోవైపు అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో... సమయపాలన పాటించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు
పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైం : తిరుమలలో ఈనెల 24వ తేదీ నుంచి జరగబోయే శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం పోలీస్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతేడాది బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించామని ఈసారి కూడా అదే తరహాలో జరగాలని కోరారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాలను అందించాలన్నారు. ఏదైనా సమస్య వస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమన్వయంతో నిర్ణయం తీసుకోవాలన్నారు. తిరుమలలోని బాలాజీ నగర్‌తో పాటు పాప వినాశనం ప్రాంతాలలో నాకాబందీ నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ఆటో డ్రైవర్లు, జీపు డ్రైవర్లు భక్తులతో ఏ విధంగా వ్యవహరించాలో అవగాహన కల్పించాలన్నారు. తిరుమలలో పబ్లిక్ అవేర్నెస్ మీటింగ్ నిర్వహించాలని ప్రజలను చైతన్యవంతులుగా చేయాలన్నారు. 400 మంది సిబ్బందితో క్రౌడ్ కంట్రోల్ ఏ విధంగా చేయాలనే దానిపైన అవగాహన కార్యక్రమాన్ని చేపట్టాలని ఆర్మ్‌డ్ అడిషనల్ ఎస్పీకి సూచించారు. మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పడినప్పుడు తిరుమలలో ఏ రూట్‌లో వెళ్లాలి.. అనే విషయం ఇప్పటికే నిర్ధారించుకోవాలన్నారు. ఇంటిగ్రేట్ చెక్ పోస్టులు కమాండ్ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. తిరుపతి, తిరుమలలో పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలన్నారు. అలిపిరి , శ్రీవారి మెట్టు మార్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి సెక్టార్లో సీసీ కెమెరాలతో పాటు సోలార్‌తో పనిచేసే కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల దర్శనం అనంతరం ఎలా వెళ్లాలి అనే దానిపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రవి మనోహర్ ఆచారి, శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటనారాయణ, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.